క్లుప్తంగా

ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయాలు మార్గదర్శకాలు



శిక్షణ తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న మాణిక్యం

రంగంపేట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయాలు మార్గదర్శకాలని సీనియర్ పాఠకులు వి.మాణిక్యం అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష ప్రాముఖ్యత, పంచతంత్ర నీతి కథలను విద్యార్థులకు బోధించారు. కె.దుర్గాప్రసాద్ గణితంలో లాజిక్కులపై, జి.ప్రసాద్ జనరల్ నాలెడ్జిపై శిక్షణనిచ్చారు.

గ్రామానికి అవసరమైన పనులను గుర్తించాలి

గోకవరం: ఉపాధి హామీ పథకంలో గ్రామానికి అవసరమైన పనులను గుర్తించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉపాధి గ్రామసభ జరిగింది. ఈ సమావేశంలో ఉపాధి సిబ్బంది పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీలు గుర్తింపు కార్డులు కోల్పోతే వారిని రెగ్యులర్ చేస్తామన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరాలశెట్టి నర్సయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే వైద్య సిబ్బంది ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదేశించారు. అనపర్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల బలోపేతానికి చర్యలు చేపట్టిందన్నారు. సీహెచ్‌సీ నుంచి అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంపు జరిగాక దానికి అనుగుణంగా వైద్య సిబ్బంది నియామకాలు జరిగాయని, అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు, ఓపీ పెరిగేందుకు కృషి చేసి ప్రభుత్వాసుపత్రిపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని సూచించారు. కొంతమంది వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని తన దృష్టికొచ్చిందని, అటువంటివారు తమ పద్ధతి మార్చుకోవాలని ఆదేశించారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడనని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా సేవలందించిన పులగం శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సనత్ కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగుర్రెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోనాల శ్రీనివాసరెడ్డి, తేతలి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత భవానీశంకర్ హత్య

- పాత కక్షలే కారణమంటున్న పోలీసులు
- నిందితుడి అరెస్ట్



బూరాడ భవానీశంకర్ (ఫైల్)



భవానీశంకర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సంజీవ్‌నగర్‌లో పాతకక్షల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బూరాడ భవానీశంకర్(58) మంగళవారం హత్యకు గురయ్యారు. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ కథనం ప్రకారం.. సీటీఆర్‌ఐ పనసచెట్టు సమీపంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన బూరాడ భవానీశంకర్, అతని భార్య కృష్ణమాధురి ఒక వేడుకకు హాజరై తిరిగి 3.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు. భవానీశంకర్ మేడపైన హాలులో కూర్చుని భోజనం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన పీటా అజయ్ అక్కడకు వచ్చాడు. ఏదో మాట్లాడే పని ఉందని చెప్పాడు. సరే భోజనం చేసి కిందకు వస్తానని అతనితో చెప్పాడు. ఇంతలో భవానీశంకర్ భోజనం చేస్తుండగా అజయ్ పైకి వచ్చాడు. ఆ సమయంలో అజయ్ తన వెనుక దాచుకుని ఉన్న కత్తిని చూసి భవానీశంకర్ భార్య గట్టిగా కేకలు వేశారు. ఈ లోపు తనతో వెంట తెచ్చుకున్న కత్తిని తీసి కడుపులో మూడుసార్లు పొడిచి, పరారు అయ్యాడు. గాయాలపాలైన భవానీశంకర్‌ను వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందారు. విషయం తెలిసిన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. హత్య జరిగిన వివరాలను కుటుంబ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ హత్య పాత కక్షల నేపథ్యంలో జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యకు గురైన భవానీశంకర్ వైఎస్సార్ సీపీ 44 వార్డు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజ్ సేకరించిన పోలీసులు హత్య చేసింది అజయ్‌గా గుర్తించి అతనిని అరెస్టు చేశారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఢిల్లీలో ఉన్న ఎంపీ భరత్‌రామ్ మృతుడి భార్య కృష్ణమాధురిని ఫోన్‌లో పరామర్శించారు.

ఐఎస్‌టీఎస్ విద్యార్థినుల ప్రాజెక్టుకు అవార్డు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు తయారు చేసిన ఇన్నోవేటివ్ ప్రాజెక్టుకు ఉత్తమ అవార్డు లభించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్‌ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో టి-హబ్‌లో ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవం జరిగిందని కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి తెలిపారు. మాటలు రాని మూగ వారు చేసే సైగల ద్వారా వారు ఏమి చెప్పాలనుకుంటున్నారో స్పీకర్ ద్వారా బయటకు వినిపించే ప్రక్రియను 'స్పీచ్ జనరేటింగ్ త్రో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఫర్ డంప్' అనే ప్రాజెక్టు ద్వారా పి.దీక్షిత, కె.చందన, దివ్యశ్రీ, జి.సత్య ప్రసన్న తయారు చేశారు. రాబోయే రోజుల్లో మూగవారికి కూడా మాట్లాడే అవకాశం ఈ ప్రాజెక్టు ద్వారా లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ నలుగురు విద్యార్థినులను తెలంగాణ స్టేట్ సాంకేతిక, సమాచార శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్ రంజాన్‌తోపాటు టి-హబ్‌లో పాల్గొన్న పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులు అభినందించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



రాజు మృతదేహం

సీతానగరం: అప్పుల బాధ తాళలేక మండలంలోని చినకొండేపూడికి చెందిన కొల్లి రాజు (32) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు మండలం పెనకలమెట్టకు చెందిన ధీనతో పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజుకు పదేళ్ల క్రితం వివాహం అయింది. ముగ్గురు పిల్లలు పుట్టి మరణించగా, ఏడాదిన్నర కుమారుడు రాజు వద్ద ఉన్నాడు. రాజు ఫిబ్రవరిలో తన భార్యను అప్పులు చేసి ఖత్తర్ పంపించాడు. కొన్ని రోజులుగా అతని భార్య తరచు ఫోన్ చేస్తూ, ఇక్కడ వేధింపులు భరించలేకపోతున్నానని, తిరిగి వచ్చేస్తానని చెబుతోంది. తమ చెల్లిని బలవంతంగా ఖత్తర్ పంపించావని, తక్షణమే వెనక్కి తీసుకురావాలంటూ రాజు బావమరుదులు అయిదుగురు ఒత్తిడి చేస్తున్నారు. వారం రోజుల క్రితం మృతుడు రాజు తన పెద్దనాన్న కుమారుడు ఏసు వద్ద తన బాధను వెల్లడించాడు. అప్పులు తీర్చే దారి కనిపించడం లేదని, బావమరుదుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని, ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తోందని చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇంటి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు చూసి, మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు మరణించగా వివాహం అయిన చెల్లెలు ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు తెలిపారు.

ఫ్లిప్‌కార్ట్ లోకల్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం

సుమారు రూ. 25 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఫ్లిప్‌కార్ట్ స్టోరేజ్ పాయింట్ లోపలి భాగం

రాజానగరం: తూర్పుగోదావరి జిల్లా, రాజానగరంలోని ఫ్లిప్‌కార్ట్ లోకల్ స్టోరేజ్ పాయింట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. భవనంతోపాటు సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగివుంటుందని అంచనా. స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. రాజానగరంలో నూకాలమ్మ గుడి వద్ద ఉన్న ఒక భవంతిలో గ్రౌండ్ ఫ్లోర్‌ని అద్దెకు తీసుకుని లోకల్ స్టోరేజ్ పాయింట్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసిన పార్శిల్స్‌ని రాజానగరం పరిసరాలలోని లబ్ధిదారులకు సకాలంలో అందించేలా సంస్థ ఈ పా యింట్‌ని ఏర్పాటుచేసి, అందుకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించింది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి లారీలో వచ్చిన పార్శిల్స్‌ని స్టోరేజ్ పాయింట్‌లో భద్రపరచి, సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. వచ్చిన పార్శిల్స్‌ని బట్వాడాకు వీలుగా గ్రామాల వారీగా విభజించేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో అక్కడకు వచ్చిన సిబ్బందిలో ఒకరైన గొంతిన సాయి స్టోరేజ్ పాయింట్ లోపలి నుంచి పొగలు రావడం చూసి, కేకలు వేశాడు. పైన నివాసం ఉంటున్న భవనం యజమానులతోపాటు పరిసరాల వారు కూడా అక్కడికి చేరుకున్నారు. మంటల వేడికి కాలిపోతున్న షట్టర్లు జాగ్రత్తగా ఓపెన్ చేసి చూస్తే లోపల భద్రపరచిన పార్శిల్స్‌తోపాటు కంప్యూటర్లు, రికార్డులన్నీ కాలిపోయాయి. ఆ మంటలు పై అంతస్తును కూడా తాకే సమయంలో విషయం తెలుసుకున్న అగ్నిమాపక దళం రాజమహేంద్రవరం నుంచి చేరుకుని, మంటలను ఆర్పి వేసింది. అయితే అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయిందని గొంతిన సాయి స్థానిక పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టుగా భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

12న జాబ్ మేళా

అనపర్తి: ఈ నెల 12న అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అనపర్తిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆయన జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్ మేళాలో 543 ఉద్యోగాలకు ఎంపికలు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, ఎం.పెరుమాళ్లరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

770 మందికి వైద్యసేవలు



సింగవరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని సింగవరంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు 770 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్‌ఎం అరుణ, ఆశావర్కర్లు స్వరాజ్యం, దేవి, విజయ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సీతానగరం: భార్య తనపై పోలీసు కేసు పెట్టిందనే మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. మండలంలోని సింగవరానికి చెందిన నాగేంద్రకు కాకినాడకు చెందిన అమ్మాయితో వివాహమైంది. అయితే ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సద్దుబాటులో తిరిగి ఒకటైన తర్వాత కూడా భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నాగేంద్రపై రాజమహేంద్రవరం దిశ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న నాగేంద్ర మంగళవారం ఉదయం తన కంఠం, చేతిపై కత్తితో కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడికి 108 అంబులెన్స్ ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ రాజశేఖర్ ప్రథమ చికిత్స చేసి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగేంద్రకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

నలుగురు వ్యక్తులపై కేసు

బిక్కవోలు: మండలంలో అతివేగంగా వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు మంగళవారం తెలిపారు.

ఆత్రేయపురంలో మహిళ హత్య

ఆత్రేయపురం: మండల కేంద్రం ఆత్రేయపురం చిన్న హరిజనపేటకు చెందిన ఒక మహిళ హత్యకు గురైనట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. భర్తతో వేరుపడిన నక్కా మహాలక్ష్మి (55) కుమారుడు, ఇద్దరు అమ్మాయిలతో చినహరిజనపేటలో నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం ఆమె హత్యకు గురైనట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని రావులపాలెం సీఐ రజనీకుమార్ పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు రైతుబజార్ ప్రారంభం

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. దీనికి ముందు రాజమహేంద్రవరంలో జరిగే వివిధ కార్యక్రమాలలో మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారు.

నేడు ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం: కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే ప్రభుత్వాస్పత్రికి బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేయనున్నట్టు జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తెలిపారు. ఉదయం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం తాత్కాలిక భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

బిక్కవోలు: మండలంలోని మోళ్లూరు విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 10 నుంచి 14 వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గోపూజ, గురువారం వేదపారాయణం, విఘ్నేశ్వరపూజ, శుక్రవారం 108 కలశాలతో మహా కుంభాభిషేకం, శనివారం హోమాలు, మహా అన్నసమారధన నిర్వహిస్తామని తెలిపారు.

12న మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ శాఖల వారీగా సమీక్ష జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరవుతారని, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

సూర్యప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం

- పెరుగుతున్న ఎండలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

రాజానగరం: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 10 గంటల నుండే గ్రీష్మ తాపం పెరిగిపోతున్న నేపథ్యంలో బయటకు రావాలంటేనే జనం హడలిపోతున్నారు. దీనితో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత కూడా ఉష్ణోగ్రత ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. నిత్యం 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసినా గానీ ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గడం లేదు. మంగళవారం మధ్యాహ్నం 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. జాతీయ రహదారిపై ఆ సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా తిరగని పరిస్థితులలో రాజానగరం, దివాన్‌చెరువు, లాలాచెరువు కూడళ్ల జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.


రాజానగరంలో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి


దివాన్ చెరువులో రహదారిపై కనిపించని జన సంచారం

వ్యాపారాలు సాగడం లేదు

వేసవి కాలంలో కూల్‌డ్రింక్స్, జూస్‌లకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరైతేనేగానీ జనం బయటకు రావడం లేదు. దీనితో ఆ సమయంలో దాహార్తిని తీర్చే కూల్‌డ్రింక్స్, జ్యూస్‌ల విక్రయాలు అంతం మాత్రంగానే ఉంటున్నాయని విక్రేతలు వాపోతున్నారు.

వడగాల్పులతో జాగ్రత్త

ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వడగాల్పులు తగిలే అవకాశాలు కూడా అధికంగానే ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగవద్దంటున్నారు. చమటలతో శరీరం డీహైడ్రేషన్‌కి గురికాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ సూచించారు. అలాగే నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం వైశాఖ మాసం చవితి సందర్భంగా భారీగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ అధికారి ప్రసాద్ తెలిపారు.

విద్యాకుసుమాలు.. ఈ సోదరీమణులు

రంగంపేట: కృషి, పట్టుదల ఉంటే ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే మంచి ఫలితాలు సాధించొచ్చని రుజువు చేశారు రంగంపేటకు చెందిన సోదరీమణులు చాగంటి మంజుశ్రీరమ్య, బేబీజాహ్నవి. మంజుశ్రీరమ్య స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుకుని ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 857 మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బేబీ జాహ్నవి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుని 600 మార్కులకు గాను 535 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. విద్యార్థినుల తండ్రి చాగంటి పద్మనాభం వ్యవసాయ కూలీ కాగా తల్లి గృహిణి. వీరిద్దరూ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథిలు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన సోదరీమణులు మంజుశ్రీరమ్య, బేబీజాహ్నవి

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

అనపర్తి: ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం రాజానగరం-పెదపర్తి ఆర్‌అండ్‌బీ రహదారిలో మండలంలోని రామవరం గ్రామ పరిధిలో రూ.20 లక్షల ఆర్‌అండ్‌బీ నిధులతో నిర్మించే కల్వర్ట్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మూడు నెలల క్రితం కల్వర్టు కుంగడంతో రామవరం పరిసర ప్రాంత రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కృషితో నిధులు మంజూరై కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ నాయకుడు సత్తి వెంకటరెడ్డి, ఆర్‌అండ్‌బి ఏఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

గిట్టుబాటు ధర కల్పించాలి

గోకవరం: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గోకవరంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కి విన పత్రం అందించారు.

టీడీపీ నాయకుల ధర్నా

మధురపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం కోరుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందించారు.

విద్యార్థి వీరబాబుకు అభినందనలు


విద్యార్థి హేమ సుందర్ వీరబాబును అభినందిస్తున్న ఎంపీడీఓ పి.విజయభాస్కర్

పెదపూడి: పదో తరగతి పరీక్షల్లో 588 మార్కులతో కాకినాడ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన పెదపూడి మండలం కుమారప్రియం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రెడ్డి హేమ సుందర వీరబాబు మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. కుమారప్రియం గ్రామంలో హేమ సుందర వీరబాబు, అతడి తల్లిదండ్రులకు ఎంపీడీవో విజయభాస్కర్ అభినందనలు తెలిపారు. విద్యార్థికి శాలువాకప్పి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారుచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, ఎస్‌వీ స్వామి, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సందడి

మధురపూడి: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభం సందర్భంగా మంగళవారం కోరుకొండ మండలంలోని సచివాలయాల్లో సందడి నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు వీక్షించారు. కోరుకొండ, బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నం, కోటికేశవరం సచివాలయాల్లో, స్థానిక కాపవరంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు వీక్షించారు.


కోరుకొండ సచివాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు, నాయకులు

